

మూడో విడత రీసర్వే ప్రారంభం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మూడో విడత రీసర్వేను శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 221 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని, మరో 22 గ్రామాల్లో రీసర్వే చేయనున్నామని పేర్కొన్నారు. రైతులు అందరూ సహకరించాలని, రెవెన్యూ సిబ్బంది ఎవరి భూమి ఎప్పుడు సర్వే చేస్తారో ముందుగా నోటీసు ద్వారా తెలియజేస్తారని తెలిపారు. భూమిని రీసర్వే చేసే సమయంలో సంబంధిత రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. సర్వే పూర్తయిన అనంతరం ఏ రైతు భూమి ఎంతుందో నోటీసు ద్వారా రైతులకు తెలియజేస్తారని తెలిపారు. అభ్యంతరాలుంటే స్పష్టమైన సమాచారాన్ని సంబంధిత శాఖల అధికారులకు రైతులు ఇవ్వాలని సూచించారు.


నేవీ ఆయుధ డిపోకు..
సాగు భూములే ఎందుకు..!

- పామాయిల్, వేరుశెనగ వంటి పంటలు పండే భూములపై కన్ను
- బర్రింకలపాడు, ఇతర అటవీ భూముల్లో పెట్టుకునే అవకాశమున్నా బేఖాతరు
- వంకావారిగూడెం గ్రామం ఖాళీ చేయించడమే లక్ష్యంగా ముందుకు
- మండల పరిషత్ తీర్మానంతో ముందుకెళ్లేందుకు కుయుక్తులు
- రీసర్వే గ్రామ సదస్సును సైతం వ్యతిరేకించిన గ్రామస్తులు
- వచ్చే ఆదివారం పీసా కమిటీ ఏర్పాటు చేసి తెలుస్తామంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధుల వ్యవహార శైలి రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. ప్రజాభిప్రాయానికి ఏమాత్రం విలువ లేకుండా ముందుకు సాగుతున్న తీరు ఆందోళనకు తావిస్తోంది. జీలుగుమిల్లి మండలంలో ఏర్పాటు చేయాలని చూస్తున్న నేవీ ఆయుధ డిపోకు గిరిజనుల సాగుభూములే ఎందుకని, గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆనుకుని ఉన్న బర్రింకలపాడు అటవీ భూముల్లోగాని, ఇతర ప్రాంతాల్లోగాని నిర్మించే అవకాశమున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ఆయుధ డిపో పెడతామంటూ ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్న తీరుపై అక్కడి ప్రజలు మండిపడుతున్నారు.

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీతంపేటవారిగూడెం గ్రామాల్లో మొత్తం 1,166 ఎకరాల భూములను సేకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. నేవీ ఆయుధ డిపోకు సేకరించాలని చూస్తున్న భూములన్నీ పామాయిల్, వేరుశెనగ, పొగాకు వంటి పంటలు పండే నాణ్యమైన భూములు. ఆ భూముల్లో పని చేసుకుని ఆయా గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. దీంతో తమ భూములు ఇచ్చేది లేదంటూ ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటి వరకూ మూడుసార్లు వ్యతిరేకంగా గ్రామసభల్లో తీర్మానం సైతం చేశారు. అంతేకాకుండా పెద్దఎత్తున ఆందోళనలు సైతం సాగిస్తున్నారు. అయినప్పటికీ బలవంతంగా నేవీ ఆయుధ డిపోను వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోనే ఏర్పాటు చేయాలని అధికారులు, ఎంపీ, ఎంఎల్ఎ మొండిగా ముందుకు సాగుతున్నారు.



రీసర్వే గ్రామ సదస్సు

వేరేచోట పెట్టుకోండి..

వ్యవసాయం చేసుకునే సాగు భూముల్లో కాకుండా అదే మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆనుకుని ఉన్న బర్రింకలపాడు అటవీ భూముల్లోగాని, దర్భగూడెం అటవీ భూముల్లోగాని, వేరే ప్రాంతంలోగాని పెట్టుకోవాలని అక్కడి ప్రజలు సూచిస్తున్నారు. తాము వద్దంటే వినకుండా బలవంతంగా ఇక్కడే పెట్టాలని చూడటం అత్యంత దుర్మార్గమని మండిపడుతున్నారు. నేవీ ఆయుధ డిపో కేంద్రం పరిధిలోని రక్షణశాఖకు సంబంధించింది. అటవీభూముల్లో ఏర్పాటు చేసే ఆలోచన చేయకుండా గిరిజనులకు ఆధారమైన సాగు భూముల్లో ఎందుకు నిర్మించాలని చూస్తున్నారో అర్థం కావడం లేదు. ఇతర ప్రాంతాల్లో సాగు చేయని భూముల్లోనైనా నిర్మించుకునే అవకాశం ఉంది. జిల్లా అధికారులు రాజకీయ నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గి గిరిజనులను ఇబ్బంది పెడుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీ, ఎంఎల్ఎ మొండిగా ముందుకు సాగడం వెనుక వేరే ఆలోచనలు ఉన్నాయనే చర్చ సైతం సాగుతోంది.

అడ్డదారుల్లో ముందుకెళ్లే ఆలోచనలు..

నేవీ ఆయుధ డిపోను ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో రాజకీయ నాయకులు అడ్డదారులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభ తీర్మానం లేకుండా ఏ పనీ చేయడానికి వీలుండదు. ఆయుధ డిపో ఏర్పాటును గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామసభ తీర్మానం అనుకూలంగా జరిగే అవకాశం లేదని తేలిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా మండల పరిషత్‌లో ఎంపిటిసిలతో అనుకూలంగా తీర్మానం చేసి ముందుకు సాగాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. నేవీ ఆయుధడిపోకు అనుకూలంగా సంతకాలు చేయాలని రాజకీయ నాయకులు ఎంపిటిసిలకు ఫోన్లు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగితే తీవ్ర ప్రతిఘటన తప్పదని వంకావారిగూడెం ప్రజలు హెచ్చరిస్తున్నారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో గురువారం రీసర్వే పేరుతో ఏర్పాటు చేసిన గ్రామ సదస్సును సైతం అక్కడి ప్రజలు వ్యతిరేకించారు. రీసర్వే సదస్సు అధికారులు, ప్రజాప్రతినిధుల కుట్రలో భాగమని అంతా చెబుతున్నారు. ఈ నెల ఐదో తేదీన పీసా కమిటీ ఏర్పాటు చేసి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం మొండిగా ముందుకు సాగితే దేనికైనా సిద్ధమని గిరిజనులు హెచ్చరిస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ఇంత నిర్లక్ష్యమా

ప్రభుత్వమే కక్షగట్టడం దారుణం

కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యలు పరిష్కరించాలని న్యాయంగా పోరాడుతుంటే ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని పిహెచ్‌సి వైద్యులు ప్రశ్నించారు. భీమవరం కలెక్టరేట్, డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఎదుట ఎపి పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ (ఎపిపిహెచ్‌సిడిఎ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యాధికారులకు 25 ఏళ్లుగా టైమ్‌బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడం దారుణమన్నారు. పొరుగు రాష్ట్రాలన్నింటిలోనూ నిరంతరం అమలవుతున్న ఈ హక్కు మన రాష్ట్రంలోనే నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. ఎపివివిపిలో మూడేళ్ల అనుభవం ఉన్న సిఎఎస్‌లకు ప్రమోషన్లు మంజూరు చేశారని, 25 ఏళ్లుగా సేవలందిస్తున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని వైద్యులు మాత్రం ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తూ రిటైరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 99 ద్వారా ఇన్‌సర్వీస్ పిజి కోటా కేవలం 15 శాతానికి తగ్గించి, అదీ ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఖండించారు. కేరళలో 50 శాతం, కర్నాటకలో 40 శాతం, తమిళనాడులో 30 శాతం ఇన్‌సర్వీస్ కోటా పిజి సీట్లను మంజూరు చేస్తున్నప్పుడు, మన రాష్ట్రంలో మాత్రం వైద్యులను వెనకడుగు వేయించే విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే తమపై ప్రభుత్వమే కక్షగట్టడం ఎంతవరకూ సమంజసమని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు, వైద్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్యులు

స్వచ్ఛాంధ్రలో జిల్లాకు అవార్డుల పంట

- ఒక రాష్ట్రస్థాయి, 49 జిల్లాస్థాయి అవార్డులు కైవసం
- జిల్లాస్థాయి విజేతలకు 6న ఇన్‌ఛార్జి మంత్రి, ప్రముఖుల సమక్షంలో సత్కారం
- కలెక్టర్ నాగరాణి



కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఒకటి, జిల్లాస్థాయిలో 49 అవార్డులను గెలుపొందినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వచ్ఛాంధ్ర అవార్డులు కైవసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులు 2025కి రేటింగ్, ర్యాంకింగ్ ఎంపిక, స్వీయ అంచనా, జిల్లా అధికారుల ధ్రువీకరణ, రాష్ట్రస్థాయి మూడు దశల్లో నిర్వహించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలిదశ స్వీయ అంచనాల్లో 1,20,057 కేంద్రాలు పాల్గొన్నాయని, వాటిలో 1,12,833 కేంద్రాలను రెండో దశ జిల్లాస్థాయిలో ధ్రువీకరించారని, వీటిలో మూడో దశలో 69 రాష్ట్రస్థాయిలో, 1,257 జిల్లాస్థాయి నామినేషన్లను అవార్డులకు పరిశీలించారని తెలిపారు. వీటిలో మన జిల్లా ఒక రాష్ట్రస్థాయి అవార్డును, 49 జిల్లాస్థాయి అవార్డులను గెలుపొందిందన్నారు. ఈ నెల 6న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అవార్డు రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా స్థాయి అవార్డు విజేతలకు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమక్షంలో సత్కరించి అందజేస్తారన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన



సచివాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అర్తమూరు గ్రామ దళితులు

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామానికి రహదారి పునర్నిర్మించాలని, గ్రామంలోని దళితవాడలో కచ్చా డ్రెయినేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని అర్తమూరు గ్రామ సచివాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలువురు దళితులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, సీనియర్ నేత ధనికొండ శ్రీనివాస్ మద్దతు పలికి మాట్లాడారు. మండలంలోని చెరుకువాడ- అర్తమూరు రాష్ట్రీయ రహదారిని పునర్నిర్మించాలని కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు పలుసార్లు అధికారులు, నేతల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని దళితవాడలో కచ్చా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడం వల్ల వర్షాకాలంలో రహదారిపై నీళ్లు నిలిచి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ దళితవాడలు అభివృద్ధికి ఆమడదూరంలోనే నిలిచిపోయాయని, పాలకులు స్పందించి దళితవాడలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, శానిటేషన్ విధిగా చేయించాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకూరి వెంకటరత్నం, జొన్నల వజ్రం, రామకూరి సంజీవరావు, కొదమ రత్న మాణిక్యం, ఎస్తేరు, సౌజన్య, మరియమ్మ, శాంతకుమారి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

రీసర్వేలో ఎదురైన సమస్యలను పున్ణపరిశీలించి రైతులకు తగిన న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల రీసర్వే పూర్తి చేసుకున్న పాందువ్వ గ్రామంలో నిర్వహించిన గ్రామసభ దృష్టికి రైతులు పలు సమస్యలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు ఇవ్వడం వల్ల కొంతమంది తమ అభ్యంతరాలను తన దృష్టికి తీసుకొచ్చారని, వీటిని పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ఈ సందర్భంగా గ్రామంలోని దళితవాడలోని సమస్యలను కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ తీసుకెళ్లారు. గోపీ మాట్లాడుతూ రీసర్వేలో సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్క ఉపాధి హామీ శ్రామికునికి వంద రోజులు పని దినాలను కల్పించాలని, అర్హులైన ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరారు. గ్రామంలోని దళితవాడలో కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని, జలజీవన్ మిషన్ పథకంలో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్ల ద్వారా శుద్ధ జలాలను ప్రతి ఇంటికీ అందజేయాలని ఆయన కోరారు. ఈ సభలో భీమవరం ఆర్‌డిఒ ఆర్.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మల్లికార్జునరావు, డిప్యూటీ తహశ్శసూర్యనారాయణ రాజు, మండల సర్వేయర్ రత్నావళి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం



యర్రంశెట్టి వారి పాలెంలో ర్యాలీ

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు కోరారు. వైఎస్‌పాలెంలో భూమి రీసర్వే కార్యక్రమంపై సచివాలయం వద్ద సర్పంచి నాగ ముత్యమాంబ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథి దాసి రాజు మాట్లాడుతూ రైతుల భూములు ఎలాంటి వివాదాలు లేకుండా, ప్రభుత్వ రికార్డుల ప్రకారం సక్రమమైన డాక్యుమెంట్లు అందించే విధంగా సర్వే జరుగుతుందన్నారు. రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సిబ్బందికి తెలియజేసి, సర్వే బృందానికి సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అయితం సత్యనారాయణమూర్తి, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఎర్రంశెట్టి బాబులు, ఎంపిటిసి ఆకన శ్రీదేవి శ్రీనివాస్, డిటి ప్రసాద్, ఆర్‌ఐ సురేఖ, విఆర్‌ఒ చిరంజీవి, సచివాలయ సెక్రటరీ డి.రాజు పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ప్రజాశక్తి - ఆచంట



కరుగోరుమిల్లి వద్ద తగ్గుముఖం పడుతున్న వశిష్ట గోదావరి

వశిష్ట గోదావరి వరద తగ్గు ముఖం పట్టింది. మండలంలోని కోడేరు వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం మూడడుగుల మేర తగ్గింది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే లంక గ్రామాలకు పడవలపై రాకపోకలు నిషేధం ఇంకా కొనసాగుతుంది. కరుగోరుమిల్లి పుష్కర ఘాట్ ఇంకా ముంపులోనే ఉంది. తహశీల్దార్ జి.కనకరాజు, రెవెన్యూ అధికారులు వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరసాపురం: వశిష్ట గోదావరికి వరద ఉధృతి కొనసాగుతుంది. ఎగువ నుంచి లక్షల క్యూసెకుల వరద నీటిని వశిష్ట గోదావరిలోకి విడిచిపెట్టడంతో నరసాపురం వద్ద గోదావరి నిండుకుండలా మారింది. దీంతో గోదావరి రేవుల్లో స్నానాలకు అనుమతించడం లేదు. ఇక గోదావరిపై సఖినేటిపల్లి-నరసాపురం మధ్య పంటు రాకపోకలు శుక్రవారం కూడా నిలిచే ఉన్నాయి.

హెల్త్ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

హెల్త్ సెంటర్ కార్మికుల బకాయి వేతనాలు చెలించాలని సిఐటియు నాయకులు ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్‌కె.పాదుషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లకు ఐదు నెలలుగా వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ బకాయిలు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదనంగా కార్మికులకు వారికి సంబంధం లేని అదనపు పనులు అప్పగించడంతో పని భారం పెరిగిందని తెలిపారు. కొత్త, పాత ఆసుపత్రుల్లో మొత్తం 45 పడకలు ఉన్నప్పటికీ, 15 నుండి 16 మంది సిబ్బంది చేయాల్సిన పనులను కేవలం 8 మంది మాత్రమే నిర్వహిస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం సిహెచ్‌సి సూపరింటెండెంట్ కె.రాంబాబుకు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. 14 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించకుంటే కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలోకి దిగనున్నట్లు తెలిపారు. సమ్మెకు సంబంధించిన బాధ్యత సూపరింటెండెంట్, జిల్లా అధికారులపై ఉంటుందని తెలిపారు.



అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న నేతలు, కార్మికులు

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

డిఎంహెచ్‌ఒ గీతాభాయి

ప్రజాశక్తి - నరసాపురం

పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని డిఎంహెచ్‌ఒ గీతాభాయి అన్నారు. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తొలుత పిహెచ్‌సిలోని మందులు, ఓపి, ఐపి వివరాలు, ల్యాబ్, స్టాఫ్ రూమును, పలు విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. ఆస్పత్రిని పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. సిబ్బందికి సంబంధించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ సదుపాయాలు ఎలా ఉన్నాయి, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, మీకు అవసరమైన మందులు ఇస్తున్నారా వంటి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ కాన్పులు, ఇతర అత్యవసర కేసులను సిహెచ్‌సికి తరలించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఉన్నందున అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ కె.శ్రీనివాసరావు, హెచ్‌వి నాగమణి తదితరులు పాల్గొన్నారు.




రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ గీతాబాయి

పివి సింధు మరిన్ని పతకాలు సాధించాలి : ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి.సింధుతో పాటు భర్త వెంకట దత్తసాయి, కుటుంబ సభ్యులను శుక్రవారం ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విజయవాడలో కలిశారు. సింధు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సింధు మావయ్య వెంకటేశ్వరరావు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆయన కుటుంబానికి ఆప్తమిత్రులు. ఆమె క్రీడా ప్రతిభ ఎంతోమంది యువతకు స్ఫూర్తి నిస్తుందని రాధాకృష్ణ కొనియాడారు.



బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సింధుతో తణుకు రాధాకృష్ణ

దత్తు బార్ మూసేయాలని ఆర్‌డిఒకు ఐద్వా వినతి

ప్రజాశక్తి - నరసాపురం

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దత్తు బార్ మూసివేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఒకపక్క సూర్య కాలేజీ, మరోపక్క బస్టాండు, ఎదురుగా కనకదుర్గ గుడి ఉండగా మధ్యలో బార్ పెట్టడం చాలా అన్యాయమన్నారు. ఎవరి అనుమతులూ తీసుకోకుండా బార్ అక్కడ నడపడం విద్యార్థులకు, మహిళలకు, గుడికి వచ్చే భక్తులకు చాలా ఇబ్బందిగా ఉందని మహిళలు వాపోతున్నారన్నారు. వెంటనే ఆ బార్‌ను అక్కడి నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షురాలు గౌర లక్ష్మి, నేతలు భువనేశ్వరి, కౌరు సుధ పాల్గొన్నారు.



ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఐద్వా నాయకురాలు

ఖజానాధికారిని కలిసిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా ఖజానాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ మజార్ బేగ్‌ను రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యువి.పాండురంగారావు, భీమవరం ఉపఖజానా అధికారి అల్లూరి రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ఖజానాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి
www.prajasakti.com

142 యూనిట్ల రక్తం సేకరణ

ప్రజాశక్తి - భీమవరం

స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా రెడ్‌క్రాస్ తఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలతో జిల్లా 15 రోజుల పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన ప్రోత్సాహక సమావేశాలు, రక్తదాన శిబిరాలు, బ్లడ్ గ్రూపింగ్, హెమోగ్లోబిన్ పరీక్షలు, తలసీమియా స్క్రీనింగ్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖతో కలిసి నిర్వహించారు. భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ల ద్వారా మొత్తం 142 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అదనంగా జిల్లాలోని 9 కేంద్రాల్లో బ్లడ్ గ్రూపింగ్, హెమోగ్లోబిన్ పరీక్షలు, తలసేమియా స్క్రీనింగ్ చేపట్టి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంఎస్‌విఎస్.భద్రిరాజు, వైస్ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు గోపీశెట్టి కృష్ణారావు, సుచిత్ర కార్యక్రమంలో భాగస్వాములైన సిబ్బందిని అభినందించారు.

డిఎస్‌సిలో 18 మంది వైఎన్ విద్యార్థులకు కొలువులు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక జివిఆర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, వైఎన్ బిఇడి కళాశాలలో బిఇడి విద్యనభ్యసించి 2025 డిఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణులై కొలువులు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులైన 18 మంది పూర్వ విద్యార్థులకు కళాశాల వైస్ ప్రెసిడెంట్ చినమిల్లి సత్యనారాయణరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల, ప్రతిభ కారణంగా డిఎస్‌సిలో ఉద్యోగాలు సంపాదించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామ సతీష్, బిఇడి కళాశాల కరస్పాండెంట్ కానూరి స్వామినాయుడు, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘు రామారావు, కళాశాల యాజమాన్య సభ్యులు గన్నాబత్తుల వెంకట శ్రీనివాసరావు, బొరుసు సుబ్బారావు, డాక్టర్ కెఎస్.నారాయణ వర్మ పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి - కాళ్ల


సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని పాతపేట ప్రాంతవాసులు తెలిపారు. కాళ్లకూరు గ్రామం పాతపేటకు చెందిన నున్న శృంగారం అనారోగ్యంతో మృతి చెందారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శృంగారం కుమారుడు ఆంద్రియకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు పాల్గొన్నారు.

శ్రీవారికి బంగారు ముత్యాల లాకెట్ బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని వెంకటేశ్వరస్వామికి శుక్రవారం బంగారు ముత్యాల లాకెట్‌ను దాతలు బహూకరించారు. ఏలూరుపాడుకు చెందిన మాన్యం రమేష్ దంపతులు సుమారు రెండు లక్షల రూపాయలకుపైగా విలువైన లాకెట్‌ను దేవస్థానం ఇఒ అరుణ్ కుమార్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించి, వారికి వేద పండితుల ఆశీర్వచనాలతో స్వామివారి శేషవస్త్రం అందించారు.


పెదఅమిరంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్,జిల్లా కలెక్టర్

ప్రకృతి సాగు ఎంతో మేలు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రకృతి సాగు రైతులు పండించిన కూరగాయలు విక్రయించేందుకు ప్రభుత్వ స్థలం అనుకూలంగా ఉంటుందని డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘు రామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పెదఅమిరం-భీమవరం సరిహద్దు జువ్వలపాలెం రోడ్డులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో పారిశుధ్య నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ వద్ద జరిగిన ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సభకు గ్రామ సర్పంచి మూర అలంకారం అధ్యక్షత వహించారు. సభలో సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాల వల్ల పారిశుధ్యం క్షీణించి ప్రజలు రోగాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలపై దృష్టి పెట్టి పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



జల జీవన్ మిషన్ పనులు పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి - తణుకు

వేల్పూరులో అర్థాంతరంగా నిలిచిపోయిన జల జీవన్ మిషన్ పనులు తక్షణం పున:ప్రారంభించి ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్ తక్షణం ఇవ్వాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో ప్రతి ఇంటికీ ఉచిత కుళాయిలు ఏర్పాటు చేయాలని, సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 10వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ ఉచిత కుళాయిలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2022లో ప్రారంభించిన ఈ పనుల పట్ల సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో ఎటువంటి పురోగతీ లేదని వీరభద్రరావు విమర్శించారు. గతేడాది స్థానిక పంచాయతీ వద్ద అధికారులకు వినతిపత్రం అందించి సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ పనుల పట్ల నేటికీ అతీగతీ లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయకుండా అసంపూర్ణంగా ఎందుకు నిలిచిపోయాయో తిరిగి ఎప్పుడు పున: ప్రారంభిస్తారో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 10వ వార్డు శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, తాళ్ల సత్యనారాయణ, కూడకా వీరభద్రరావు, దొడ్డిపట్ల గణపతి, విశ్వనాథం సుబ్బారావు, వాటాల నాగేశ్వరరావు, అందే నాగ శ్రీను, కర్రి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని మూడో వార్డు జెట్టివారివీధిలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,090 నగదు, ఒక టేబుల్, ఎనిమిది కుర్చీలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడేందుకు అద్దెకు ఇచ్చిన ఇంటి యాజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు సిఐ బి.యాదగిరి తెలిపారు.

గ్రామాలాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మినీ గోకులానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్


ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాల అభివృద్ధికి ప్రజలందరూ ఏకమై భాగస్వాములు కావాలని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధి హామీ 2.0 చట్టం కింద పెంటపాడు మండలం జట్లపాలెం, తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలో మంగలక్ష్మి, కొరుకూటి వీరాస్వామికి మంజూరైన మినీ గోకులానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో తాడేపల్లిగూడెం మండల వ్యాప్తంగా ఇప్పటికే 100 మినీ గోకులాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 6 మినీ గోకులాలను ప్రారంభించనున్నామని తెలిపారు. కూటమి నాయకులు, గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటేష్ బాబు, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - యలమంచిలి

గతంలో సిపిఎం తరపున ఎంపిపిగా బాధ్యతలు నిర్వహించిన చించినాడ గ్రామానికి చెందిన గోడ సుజాత భర్త సిపిఎం సభ్యులు గోడ నాగేశ్వరరావు (72) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, సీనియర్ నేత, మాజీ సర్పంచి కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు తదితర నాయకులు నాగేశ్వరరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. వారి వెంట పార్టీ శ్రేణులు దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, తెన్నేటి శివాజీ, తాడి ఉదయ్‌కుమార్, ఆకుమర్తి జోసెఫ్ రాజు, విప్పర్తి గణపతి, కోరం వెంకటేశ్వరరావు, గంటా ఏసు, దుండి తాతాజీ, తాళ్ల శ్రీనివాస్ ఉన్నారు.


నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వెంకట సత్యనారాయణ కుటుంబానికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన చించినాడ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ కేతా వెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులైన కేతా వాసు, కేతా సూర్యారావును సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మండల కార్యదర్శి కానేటి బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలోనే చించినాడ పోరాటంలో వారి తల్లిదండ్రులతో కలిసి పోరాటంలో పాల్గొన్న వెంకట సత్యనారాయణ తదనంతరం విద్యార్థి సంఘంలో కూడా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. వారి వెంట సిపిఎం మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, టి.నాగరాజు, 8వ వార్డు సభ్యులు తెన్నేటి స్టాలిన్, నాయకులు శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, తెన్నేటి శివాజీ, ఆకుమర్తి జోసెఫ్ రాజు ఉన్నారు.


వెంకట సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుల వివక్ష నిర్మూలన తప్పనిసరి: కెవిపిఎస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

సమాజంలో కులవివక్ష నిర్మూలన సంపూర్ణంగా జరగాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ అన్నారు. శుక్రవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 27వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని జుత్తిగలో ఆ సంఘ పతాకాన్ని సంఘం మండలాధ్యక్షులు కృష్ణ ఎగురవేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు, దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు అరికట్టేందుకు,


మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్

సామాజిక, ఆర్థిక సమానత్వం సాధనకు కెవిపిఎస్ ఏర్పడిందని గుర్తు చేశారు. సంఘం పోరాట ఫలితంగానే ప్రతి దళితవాడకు రెండు ఎకరాల శ్మశాన వాటిక స్థలం కేటాయించేలా జిఒనెం.1235 సాధించామన్నారు. 50 సంవత్సరాలు పైబడిన డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని పోరాడి విజయం సాధించిందని తెలిపారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ సిఫార్సుల్లోనూ కీలకపాత్ర వహించిందని అన్నారు. రానున్న రోజుల్లో సంఘం చేపట్టే ఆందోళనల్లో అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వసంతాడ కామయ్య, కొడమంచిలి శివ, ఎజర్ల ఆనంద్, కొడమంచిలి సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల సేవలో..

జిల్లాలో 8,489 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి - కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అర్హులైన 8,489 మంది లబ్ధిదారులకు ఈ నెల 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ద్వారా లబ్ధి చేకూరనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ఏర్పాట్లపై శుక్రవారం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో గూగుల్‌మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో అర్హులైన 8,489 మంది ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుందన్నారు. రవాణా శాఖాధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పొరపాట్లు జరగకుండా సజావుగా జరిగేలా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

స్వాతంత్ర సమరయోధుల అడుగుజాడల్లో నడవాలి

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. మహాత్మాగాంధీ, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సంస్థ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఫలాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ముందుగా నిట్ తూర్పు ముఖద్వారం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, ఆచార్యులు రాముడు, డాక్టర్ పులి కిషోర్ పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకు

స్వాతంత్ర సమరయోధుల పార్కులో ప్రతిష్టించిన గాంధీజీ విగ్రహం ఈ ప్రాంత ప్రజలకు, భావితరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం గాంధీజీ జయంతి సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల పార్కులో గాంధీజీ విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆవిష్కరించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గాంధీజీ విగ్రహ ప్రదాతలైన స్వాతంత్ర సమరయోధులు సంకు అప్పారావు కుమార్తె సంకు మనోరమ, డివివియస్ వర్మ దంపతులను రాధాకృష్ణ అభినందించి, సత్కరించారు. అనంతరం ఎంఎల్ఎ రాధాకృష్ణ, సంకు మనోరమ, డివివిఎస్ వర్మ మాట్లాడారు. స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు యర్రమిల్లి విజయలక్ష్మీ, చాల్లా హైమావతి, భూపతిరాజు రమేష్ చంద్రబాబు, నడింపల్లి రాంబాబు, డా.రామదాసు, డా.వసుంధర, సంకు సూర్యకుమారి, రామారావు పాల్గొన్నారు.

టవర్ ఎక్కి వైసిపి నేత హల్‌చల్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా నాయకుడు కాకిలేటి ఆనంద్ కుమార్ గురువారం సెల్ టవర్ ఎక్కి చనిపోతానంటూ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో హల్‌చల్ చేస్తోంది. తన బర్త్ డే సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని పట్టణ సిఐ బి.యాదగిరి కొంతమంది ప్రయివేటు వ్యక్తులను పెట్టి తొలగించారని, ఆ ప్రాంతంలో అనేక రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఉండగా తన ఫ్లెక్సీని తొలగించారని తెలిపారు. తాను దళితుడను కాబట్టే ఫ్లెక్సీ తొలగించారని ఆవేదన చెందాడు. ఫ్లెక్సీ తొలగించిన వారిపై, సిఐ యాదగిరి పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో టవర్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపారు. టవర్ పైకి రెండు పెట్రోల్ బాటిల్స్ తీసుకెళ్లిన బాధితుడు ఫ్లెక్సీ తొలగించిన వారిపై పోలీస్ స్టేషన్ నమోదు చేయాలని నరసాపురం సిఐ యాదగిరిని సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశాడు.

అక్రమంగా బాణసంచా నిల్వ చేస్తే చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

బాణసంచా అక్రమ నిల్వలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.వాసు హెచ్చరించారు. గురువారం మొగల్తూరులోని పలు బాణసంచా విక్రయ దుకాణాలను సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ వాసు

10న భీమవరంలో పెన్షన్ అదాలత్

భీమవరం : భీమవరంలో ఈ నెల 10న నిర్వహించనున్న పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పెన్షన్ అదాలత్ - ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎట్ యువర్ డిస్ట్రిక్ట్' కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ ఆఫీసర్లకు, పెన్షన్ మంజూరు అధికారులకు మార్గనిర్దేశం చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో, సరైన రీతిలో సమర్పించడం గురించి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దీని కారణంగా ఉద్యోగ విరమణ తేదీకి ముందే పెన్షనర్ ప్రయోజనాలను పొందేలా చేస్తుందని తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. 'పెన్షన్ అదాలత్' కార్యక్రమంలో తనతో పాటు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర స్థాయి అధికారులు డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.ఆశ్రిత పట్నాయక్, స్టేట్ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఎస్.మోహనరావు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు ఎస్.బాలాజీ, టి.విజయ్ కుమార్, ఎస్.నాగమురళి పాల్గోనున్నట్లు తెలిపారు.

జనసేనలో చేరికలు

నరసాపురం: సీతారాంపురం సౌత్ మాజీ సర్పంచి అడబాల అయ్యప్ప నాయుడుతో పాటు వైసిపి నుంచి సుమారు యాభై మంది కార్యకర్తలు జనసేనలో చేరారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమక్షంలో పార్టీలో చేరారు. అయ్యప్ప నాయుడుకు నాయకర్ పార్టీ కండువాను కప్పి స్వాగతం పలికారు.

63 పనులు గుర్తించాం

ప్రజాశక్తి - మొగల్తూరు

కూలీలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ఉపాధి చట్టంలో లక్షల రూపాయలు మంజూరు చేస్తోందని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి అన్నారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొగల్తూరులో ఉపాధి హామీలో చేపట్టేందుకు 63 పనులను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బోణం నరసింహారావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, గుబ్బల నాగరాజు, కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎపిఒ జవ్వది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

33 కెవి విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమిత్తం శనివారం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు పరిధిలోని అన్ని ప్రాంతాలకూ, ఎస్‌విఆర్ సర్కిల్ నుంచి గణేష్ నగర్ రోడ్డు విస్తరణలో భాగంగా 33 కెవి లైన్లలో అదనపు స్తంభాల ఏర్పాటు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహామూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

మొగల్తూరులో భారీ అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ వడయార్ పేటలో శుక్రవారం భారీ అన్న సమారాధన చేపట్టారు. శరన్నవరాత్రి ఉత్సవాలు, 18వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాలకొల్లు : పట్టణంలోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో విజయదశమి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గుత్తులవానిపేట, కొత్తపేట వంటి పలు ప్రాంతాల్లో శుక్రవారం అన్న సమారాధనలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రాంబాబు ఆధ్వర్యంలో ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్టీలు యాత్రికులకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.